క్లుప్తంగా

ధ్వజస్తంభ ప్రతిష్టలో మంత్రి రజిని



గుంటూరు రూరల్: భక్తుల కోర్కెలు తీర్చే దేవుడు హరిహరనాథుడని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. బుధవారం 46వ డివిజన్ రత్నగిరిలో హరిహరక్షేత్ర ధ్వంజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యు లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో జీజీహెచ్ ప్రసూతి విభాగం



గుంటూరు మెడికల్: జీజీహెచ్ ప్రసూతి విభాగంలో భారత పరిశ్రమల సమాఖ్య సహకారంతో రూ.70 లక్షలతో ఆధునికీకరించిన 40 పడకల వార్డును ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌కు బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రసూతి విభాగాన్ని కార్పొరేట్ స్థాయిలో ఉండేలా సిద్ధం చేశారని చెప్పారు. వార్డుకు మూడు టీవీలను సమకూర్చారు. ఏసీలను పూర్తి స్థాయిలో అమర్చారు. వేసవి కాలంలో తల్లి బిడ్డ హాయిగా ఉండే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ నరసింహం సహకారంతో రూపొందించినట్లు వెల్లడించారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: ఆర్.అగ్రహారం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఉదయం సుప్రభాత సేవ, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, సహస్రనామార్చన, నవగ్రహ హోమం, నారాయణ మంత్ర హవనం, యాగ పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం చూర్ణోత్సవం, చక్రస్నానం కార్యక్రమాలలో భక్తులు భక్తి ప్రపత్తులతో పాల్గొన్నారు. సాయంత్రం ధ్వజావరోహణ, పుష్పయాగం, పూలంగి సేవ, సప్తవరణ సేవ, పవళింపు సేవ భక్తితో గావించారు. కార్యక్రమాలను ఆలయ కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు పర్యవేక్షించారు.

వైభవంగా తిరుపతమ్మ, గోపయ్య స్వామి తిరునాళ్ల

పాత గుంటూరు: కొరిటెపాడు అంజనేయపేట లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వాముల తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం గణపతి పూజ, స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు, శ్రీ లక్ష్మీ నారాయణ హోమం, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అను డ్యాన్స్ అకాడమీ నృత్యకారిణుల బృందం చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు కన్న సాని విజయకుమార్, రవి కుమార్, బాజీ పర్యవేక్షించారు.

4 రోజుల్లో ముగియనున్న వడ్డీ రాయితీ గడువు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి దారులకు ఏక మొత్తంగా చెల్లించిన వారికి కల్పించిన వడ్డీ రాయితీ గడువు మరో 4 రోజులు మాత్రమే ఉందని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏప్రిల్ ఒకటి నుంచి పన్నుపై వడ్డీ జమ అవుతుందని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ నెలాఖరులోగా తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని కోరారు. నెలాఖరు వరకు వేచి చూడకుండా ముందుగానే పన్ను చెల్లించాలని, నెలాఖరులో సర్వర్ ఆన్‌లైన్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని సూచించారు. ఏప్రిల్ ఒకటి నుంచి పన్నుపై వడ్డీ యథావిధిగా జమ అవుతుందని, బకాయిదార్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలిపారు. సెలవు రోజుల్లో కూడా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్‌లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్ లోని 148 వార్డు సచివాలయాల్లోని క్యాష్ కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయని కమిషనర్ వివరించారు.

అన్నివర్గాలకు సీఎం జగన్ అండ

- పేదల – పెత్తందారుల యుద్ధంలో జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించాలి
- పెదకాకానిలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- మంగళగిరి ఎమ్మెల్యే, పొన్నూరు ఎలక్షన్ ఇన్‌ఛార్జి ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)తో కలసి ప్రచారం



పెదకాకానిలో ప్రజలకు అభివాదం చేస్తున్న అంబటి మురళీకృష్ణ, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

పెదకాకాని: బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకానిలో రెండవ రోజు బుధవారం ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. పెదకాకాని ప్రధాన సెంటర్‌లో రాత్రి జరిగిన బహిరంగ సభకు గోళ్ల శ్యాంముఖర్జీబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ రాజకీయాల్లోకి రాకముందే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్‌ను స్థాపించి ఉచితంగా వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. నియోజకవర్గం నుంచి పైసా కూడా ఆశించకుండా నీతికర పరిపాలన కొనసాగించడంతో పాటు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గర్వించేలా పనిచేయడం జరుగుతుందన్నారు.

మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సంగం డైరీలో ఒక్క రూపాయి పెట్టుబడి పెట్టకుండా ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. ఆ డబ్బుతో 11 ఎకరాలు ఆక్రమించి డీవీసీ పేరుతో ఆసుపత్రి నిర్మించడం జరిగిందన్నారు. పెదకాకానిలో ఎన్టీఆర్ హయాంలో ఇళ్ల స్థలాలు పేదలు ఆక్రమించుకుంటే ఆ కాలనీకి ఎన్టీఆర్ కాలనీగా నామకరణం చేస్తే ఆళ్ల సోదరులు, వైఎస్సార్ సీపీ హయాంలో ఆ కాలనీకి అన్ని మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ఆ కాలనీలో ఇళ్లు తొలగించాలని, దేవదాయశాఖ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని టీడీపీకి చెందిన మన్నవ నాగేశ్వరరావు అనే వ్యక్తి ద్వారా న్యాయస్థానానికి వెళ్లడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు.



బహిరంగసభలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ, వేదికపై ఎమ్మెల్యే ఆర్కే, సర్పంచ్ గోళ్ల స్వరూపరాణి

చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే సత్తా లేదు..

ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఒంటరిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నాడని మంగళగిరి ఎమ్మెల్యే, పొన్నూరు ఎన్నికల ఇన్‌చార్జి ఆళ్ళ రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం కావాలంటే, సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్యను గెలిపించుకోవాలని అన్నారు. ప్రతి గడపకూ వెళ్ళి అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని తెలియజేసి ఓటు అడుగుతున్న పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకుని అవసరం తీరిపోయాక వారినే తిట్టే నైజం చంద్రబాబునాయుడదన్నారు. సంగం డైరీలో వాటా ఇవ్వని ధూళిపాళ్ల ఎన్నికల్లో ఓడిపోవాలని చంద్రబాబునాయుడు, లోకేష్ కోరుకుంటున్నారన్నారు. డబ్బు కట్టలతో పెమ్మసాని, మంత్రసానులు ఎంతమంది వచ్చినా భయపడేది లేదని, ప్రజలు వైఎస్సార్ సీపీనే ఆదరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యులు షేక్ గుల్జార్, మాతంగి నిర్మల, బంగారు మరియమ్మ, దంతాల శివపార్వతి, శివాలయం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, కొంకిరామారావు, పమిడిమళ్ళ అనిల్‌కుమార్, ఆలా శ్రీనివాసరావు, కారంకి వెంకటేశ్వరరావు, పఠాన్ మస్తాన్, చింతా కుమారస్వామి, మురికిపూడి చంద్రశేఖర్, భీమవరపు విజయలక్ష్మి, ముడియాల మల్లికార్జునరెడ్డి, సయ్యద్ సుభాని, నంబూరు రాఘవులు, తాతినేని నాగేశ్వరరావు, దానబోయిన నాగేశ్వరరావు, పలువురు వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ మేలు జరిగింది
- టీడీపీ నేతల ఆగడాలను, జన్మభూమి కమిటీల అకృత్యాలను జనం ఇంకా మర్చిపోలేదు
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్
- నగరాలు, హనుమాన్ నగర్‌లో 'గడప గడపకు జగనన్న – గుండె గుండెకు కిరణన్న'



ప్రజలను కలిసి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం 46వ డివిజన్ నగరాలు, హనుమాన్ నగర్‌లో గడప గడపకు జగనన్న .. గుండె గుండెకు కిరణన్న ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు బలసాని కిరణ్‌కుమార్‌కు ఘనస్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా బలసాని కిరణ్‌కుమార్ ఇంటింటికి వెళ్లి ప్రజలకు జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయగలిగిన ఏకైక నాయకుడు జగనన్న మాత్రమేనని తెలిపారు. తల్లి కడుపులో బిడ్డ నుంచి ఆశీర్వదించే అవ్వాతాతల వరకు సంక్షేమ పథకాలు అందించిన నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. చంద్రబాబు పాలనలో 40 ఏళ్లపాటు ఏ కుటుంబానికి ఏ లబ్ధి చేశాడో చెప్పి ఓట్లు అడగాలని టీడీపీ నాయకులకు సూచించారు. చంద్రబాబు, దత్తపుత్రుడు ప్రజలను మోసం చేస్తూ అధికారం కోసం కుట్రలు పన్నుతున్నారన్నారు. తమ ప్రభుత్వం వస్తే జన్మభూమి కమిటీల పేరుతో పేదలను మరోసారి దోచుకోవాలని టీడీపీ కుట్రలు పన్నుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతల ఆగడాలను, జన్మభూమి కమిటీల అకృత్యాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జగనన్న మేమంతా సిద్ధం పేరుతో చేపట్టిన ప్రచారయాత్రను చూసి టీడీపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. ప్రతిఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటువేసి జగనన్నను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులు, డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైభవం.. ప్రతిష్టా మహోత్సవం

- మంచాలలో సీతా సమేత కోదండరామస్వామి ఆలయ నూతన ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ట
- వేలాదిమందికి అన్నదానం



ఆలయం వద్ద ప్రత్యేక పూజలు



నూతన ధ్వజస్తంభ శిఖర ప్రతిష్టా కార్యక్రమం

మంచాల(చేబ్రోలు): చేబ్రోలు మండలం మంచాల గ్రామంలోని సీతాసమేత కోదండరామస్వామి దేవాలయంలో బుధవారం నూతన ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. సుమారు రెండు వందల ఏళ్ల చరిత్ర కలిగిన కోదండరామస్వామి దేవస్థానంలోని ధ్వజస్తంభం జీర్ణోద్ధరణకు చేరింది. ఈ నేపథ్యంలో నూతన జీవ ధ్వజస్తంభాన్ని పండితులు ప్రతిష్టచేశారు. శిఖర మరియు కలశ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హోమాలు, ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలను చేపట్టారు. తుని పీఠాధిపతి సచ్చిదానంద భారతీ తీర్థస్వామి ఆధ్వర్యంలో ప్రతిష్టా మహోత్సవం జరిగింది. పీఠాధిపతి అనుగ్రహభాషణం చేశారు. మంచాల పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో వేలాదిమందికి అన్న ప్రసాద వితరణ జరిగింది.

అర్చకులపై దాడి హేయమైన చర్య

పట్నంబజారు: కాకినాడలో అర్చకులపై దాడిచేసిన ఘటన సిగ్గుచేటని బ్రాహ్మణ సామాజిక వర్గం నేతలు బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి కృష్ణ, మల్లేపల్లి హనుమంత శర్మ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని వారి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్లో మీడియా అర్చకులపై జరిగిన దాడిని కూడా రాజకీయ రంగు పులమడం దుర్మార్గమన్నారు. అర్చకులపై దాడి చేసిన నిందితుడికి కఠినంగా శిక్ష పడాలని డిమాండ్ చేశారు. ఒక ప్రముఖ దినపత్రిక అధినేత కావాలనే ఉద్దేశపూర్వకంగా కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. టీడీపీని అధికారంలోని తెచ్చేందుకు ఆయన తపన పడుతున్నారని, కృష్ణా పుష్కరాల సందర్భంగా ఆధునీకీకరణ పేరుతో టీడీపీ నేతలు అనేక దేవాలయాలను కూల్చి వేశారని ఆరోపించారు.

నగదు కలిగి ఉన్న వ్యక్తిపై కేసు

పట్నంబజారు: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నగదు కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. సంపత్‌నగర్‌కు చెందిన వెంకటరాజేంద్రకుమార్ బుధవారం సాయంత్రం నాజ్‌సెంటర్ వైపు వెళుతున్నాడు. తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు ద్విచక్రవాహనంలో రూ.76,500 నగదు గుర్తించారు. దానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదు సీజ్ చేయడంతోపాటు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య



చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న మహిళ

వేజండ్ల (చేబ్రోలు): కుటుంబ సమస్యల కారణంగా ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో బుధవారం జరిగింది. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేజండ్ల దళితవాడ ప్రాంతానికి చెందిన వనజారాణి(29)కి, నరసరావుపేట మండలం కోమటివారిపాలెంకు చెందిన వడియాల శరత్ బాబుతో గత నెల 12వ తేదీన వివాహం జరిగింది. గుంటూరు, వడ్లమూడి గ్రామాల్లోని ప్రైవేటు వైద్యశాలల్లో వనజారాణి ఫార్మాశిస్ట్‌గా పనిచేసేంది. వివాహానంతరం ఇంటి వద్దనే ఉంటున్న వనజారాణి బుధవారం ఉదయం వేజండ్లలోని ఇంటిలో చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త శరత్‌బాబు రైల్వేగేట్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లి జరిగి రెండు నెలలు కూడా గడవక ముందే కుమార్తె ఆత్మహత్య చేసుకొని మృతి చెందటంతో తల్లిదండ్రులు, బంధువులు, కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు. మృతురాలి తండ్రి వేజండ్ల సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్



మద్యం విక్రేతను అరెస్ట్ చేసిన నల్లపాడు సీఐ నరేష్‌కుమార్ తదితరులు

గుంటూరు రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని నల్లపాడు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బుడంపాడు గ్రామంలో గోతం సంచిలో మద్యంబాటిల్స్ ఉంచి విక్రయాలకు పాల్పడుతున్నాడన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేయగా వెంకటరెడ్డి అనే వ్యక్తి వద్దనుంచి 40 క్వార్టర్ బాటిల్స్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, అతన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమతులు తీసుకున్న వారిదే బాధ్యత

- ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరక్కుండా చూసుకోవాలి
- పార్టీ సమావేశాల్లో జరిగే కోడ్ ఉల్లంఘనల్లో అర్జీదారు పైనే కేసులు
- నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి పి.శ్రీకర్

ప్రత్తిపాడు: రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే సంబంధిత కార్యక్రమానికి అనుమతులు తీసుకున్న వ్యక్తిపైనే కేసు నమోదు చేయడం జరుగుతుందని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.శ్రీకర్ తెలిపారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకర్ మాట్లాడుతూ సీ విజిల్ యాప్‌లో ఇప్పటివరకు 21 ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వివిధ రకాల అనుమతులకు సంబంధించి ఇప్పటివరకు అత్యధికంగా అరవైకు పైగా అర్జీలు వచ్చాయని తెలిపారు. అయితే కోడ్ ఉల్లంఘనలను మాత్రం సహించబోమని చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు విస్తృత తనిఖీలు చేస్తున్నాయని చెప్పారు. రాజకీయ పార్టీలు నిర్వహించే సమావేశాల్లో ఆయా పార్టీల అభ్యర్థులు ఉల్లంఘనలకు పాల్పడినా, వారిపై ఎలా చర్యలు తీసుకోగలమని, నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు వారిపై కేసులు నమోదు చేయలేమని, అందుకే అనుమతులు తీసుకున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామని ఆర్ఓ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో కరపత్రాలు పంపిణీ చేయాలన్నా జిల్లా కమిటీ అనుమతి ఉండాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

హరిహరనాథుని ఆలయ ప్రతిష్టామహోత్సవంలో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు



వెంగళాయపాలెం ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్ సీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌లు తెలిపారు. బుధవారం 40వ డివిజన్ పెదపలకలూరు రత్నగిరినగర్‌లోగల లక్ష్మీనరసింహ, ఆంజనేయస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేశారు. స్వామి ఆశీర్వచనం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, ముత్యాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులున్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న బలసాని..

గుంటూరు రూరల్: రంజాన్‌మాస ఎంతో పవిత్ర మాసమని ముస్లింలు ఎంతో నిష్టతో ఉపవాస దీక్షను చేసి అల్లాను స్తుతించి ఆయన కృపను పొందటం జరుగుతుందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో ముస్లింలు ఏర్పాటు చేసిన రంజాన్ పవిత్రమాస ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర ఉపవాస దీక్షను చేసిన ముస్లింలకు దీక్ష విరమణ అనంతరం వారికి పండ్లు ఫలహారాలు పంపిణీ చేశారు. రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దయతో ప్రజలంతా సంతోషంగా, సుఖంగా జీవించాలని ఆకాంక్షించారు. యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూనె ఉమామహేశ్వరరెడ్డి, కంది సంజీవరెడ్డి, ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, మిర్చియార్డ్ డైరెక్టర్ ఇంద్ర, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, అబ్దుల్ నబి, కడప వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, డబ్బూరి సూర్యప్రకాశరావు, స్థానిక ముస్లింలు, మత పెద్దలు, ముజావర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పెమ్మసానికి మతిభ్రమించింది

పొన్నూరు ముస్లిం సంఘాల నాయకులు



మాట్లాడుతున్న మాము

పొన్నూరు: టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు మతి భ్రమించిందని పొన్నూరు ముస్లిం సంఘాల నాయకులు విమర్శించారు. బుధవారం పట్టణంలోని అంజుమన్ షాదీఖానాలో సంఘాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మాము మాట్లాడుతూ డబ్బుంటే ఏదైనా సాధ్యమేనన్న పొగరుతో మతిస్థిమితం కోల్పోయి సద్దాం హుస్సేన్‌ను విమర్శించే స్థాయికి పెమ్మసాని చేరాడని మండిపడ్డారు. బీజేపీ తన వెనకాల ఉందన్న ధీమాతో ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు. అమెరికా నుంచి టూరిస్టుగా వచ్చిన పెమ్మసాని చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని, లేదంటే చరిత్ర హీనుడుగా నిలిచిపోతాడని పేర్కొన్నారు. సద్దాం హుస్సేన్ ప్రపంచంలోని ప్రతి ముస్లిం హృదయాలలో సుస్థిరమైన స్థానం పొందాడని అలాంటి నేతపై విమర్శలు చేసిన పెమ్మసాని చంద్రశేఖర్‌కు గుంటూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రతి ముస్లిం తన ఓటు అనే ఆయుధంతో తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. సమావేశంలో ముస్లిం యునైటెడ్ ఫ్రెండ్స్ పొన్నూరు నాయకుడు మెమన్ బాష, ముస్లిం సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో దుష్ప్రభావాలు

ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వి.సుజాతదేవి



మాట్లాడుతున్న సుజాతదేవి

ప్రత్తిపాడు: బాల్య వివాహాలతో బాలికలు తీవ్రమైన దుష్ప్రభావాలు ఎదుర్కోవలసి వస్తుందని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వి.సుజాతదేవి అన్నారు. వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులో మై చాయిస్ ఫౌండేషన్ సహకారంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ సుజాత దేవి మాట్లాడుతూ బాల్యం నుంచే పిల్లల మీద తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మాతాశిశు మరణాల నివారణలో అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సేవలు అనిర్వచనీయమన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మానవ అక్రమ రవాణా అతిపెద్ద సవాలుగా మారిందన్నారు. గృహహింసకు ఆస్కారం లేని కుటుంబాల్లో మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలకు తావు ఉండదని చెప్పారు. అప్‌లిఫ్ట్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ తురకా మంగయ్య మాట్లాడుతూ బడి మానేసిన పిల్లలను గుర్తించి, వారిని బడికి పంపేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ట్రైనర్ కొండపల్లి వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ మాధవి, ల్యాంప్ సంస్థ ట్రైనీ కో-ఆర్డినేటర్లు షేక్ బాజీ, బి.వెంకటేశ్వర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసుపై సమగ్ర దర్యాప్తు చేయాలి

లక్ష్మీపురం: విశాఖ పోర్టులో భారీ మొత్తంలో మాదక ద్రవ్యాల పట్టివేత దేశాన్నే ఉలిక్కి పాటుకు గురి చేసిందని అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా మన నట్టింట దాకా రావడం ఆందోళనకర విషయమని సీనియర్ సిటిజన్స్ నాయకులు ఆర్.వెంకటరత్నం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విశాఖ డ్రగ్స్ ఉదంతంలో ప్రధాన రాజకీయ పార్టీల ప్రమేయం ఉందంటూ వస్తున్న వార్తలు బ్లాస్ట్ కావడం కల్లోలం రేపుతున్నాయన్నారు. అనంతరం సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, న్యాయవాది అవధానుల హరి, విశ్రాంత అధికారి మల్లేశ్వరరావు, మురళీకృష్ణ, సింగరయ్య ప్రసంగించారు.